# స్వయంకృతం

ఊరుమాటు మడిగినవేళ. ఆదమరిచి నిద్రపోతున్న రవీంద్రకు మెలకువ వచ్చింది. ఏదో శబ్దం..ఎవరో

తలుపు కొడుతన్న శబ్దం!

మసక వెల్తురులో భార్య, బిడ్డలు ఆదమరిచి నిద్రపోవడం కనిపిస్తున్నది. ఈఅర్ధరాత్రి తలుపు ఎవరు తడతారు? ఈ వేళప్పుడు ఏ బంధువులొస్తారు? !

"రవిగారు !" ఓ స్త్రీ కుతం ఆదుర్దాగా పిలుస్తున్నది.కళ్ళు నులుముకుంటూ లేచి లైటు ఆన్ చేశాడు. చీకటిని పారదోలుతూ వెలుతురు గదిలో పరచుకుంది.పోయి తలుపు తెరిచాడు. ఎదురుగా మనోరంజని! ఆమె మొహం పాలిపోయి వుంది. స్వేదంతోనుదురు మెరుస్తున్నది.

"రవిగారు... నన్ను క్షమించండి.." కంగారుగా అంది. రోడ్డుమీద ఆటో కనిపిస్తున్నది.

"ఏం జరిగింది?" విసుగును ఆపుకుంటూ అడిగాడు రవి.

"మావారికి సీరియస్‌గా వుంది...హాస్పిటల్‌కు తీసుకుపోవాలి.." రొప్పుతూ అంది ఆమె.

"ఏమైంది?"

"బాగా తాగేశారుట! స్పృహ తప్పిపోయింది...వెంటనే హాస్పిటల్ లో చేర్చాలి...ఆటోలో వున్నారు. చేతిలో డబ్బుల్లేవు..దయచేసి..ఓ రెండొందలు..." అభిమానంతో వస్తున్న కన్నీరును ఆపుకుంటూ అడిగింది.

రవీంద్రకు చికాకేసింది.ఎప్పుడుపడితే అప్పుడు తన దగ్గర డబ్బులెలా దొరుకుతాయనుకుంది!

"సారీ! నా దగ్గర లేవు..."

"అయ్యో! కొండంత ఆశతో వచ్చాను... చివరి ప్రయత్నంగా మీ దగ్గరికి వచ్చాను". ఏడ్చేసింది ఆమె.

"సరే.. ఉండండి.. చూస్తాను". రవి అన్నాడు.

ఆమె ఎంతో ఆదుర్దాగా గుమ్మందగ్గర వేచి వుంది.

ఓ అయిదు నిమిషాల తర్వాత ఓ నూటయాభైరూపాయలు తెచ్చిచ్చాడు రవి. మెరుస్తున్న కళ్ళతో ఆ డబ్బును అందుకుని ఆటో దగ్గరికి పరిగెత్తింది మనోరంజని. ఆటో ఎక్కబోతూ... ఆటో దగ్గరికి వస్తున్న రవిని చూసి "థాంక్స్!" చెప్పింది. వెనుక సీట్లో మనోరంజని భర్త దక్షిణామూర్తి పడుకునివున్నాడు...కాదు...పండ బెట్టబడి వున్నాడు.

"టైంలేదు... డ్రైవర్ పోని...వస్తానండి".

"ఏంకాదులెండి...రేపు వచ్చి చూస్తాను". రవీంద్ర ఆటోను పంపించి వచ్చి మంచంమీద మేనువాల్చాడు.

కాని అతనికి నిద్రాభంగమైంది. మనోరంజని, దక్షిణామూర్తి ద్వయం మదిలో మెదులుతున్నారు.ఏదో బాధ! గుండెల్ని కోసేసే బాధ!

అయిదు నాలుగేళ్ళ కిందట రవి పెళ్ళిచూపులకని నెల్లూరు వెళ్ళాడు. అప్పటికి ఎంతోమంది అమ్మాయిల్ని చూడ్డం-నచ్చలేదని చెప్పడం జరిగింది. ఏదో ఒక వంక పెట్టేవాడు. ఈ నెల్లూరు సంబంధం బావుందంటే చూడ్డానికి, జరగనిదానికి మేమంతా ఎందుకు రావాలని రవి పెద్దలు అతన్ని ఒక్కడ్నే పంపించారు చూసి రమ్మని.

అనాసక్తిగా రంజని తండ్రి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న రవికి...రంజని తల్లి ఆమెను హాల్లోకి మెల్లగా తీసుకురావడం కనిపించింది.

మనోరంజని అతని ముందుకు వచ్చి నమస్కారం పెట్టి కుర్చీలో కూర్చొంది. అంతే! హై వోల్టేజి కరెంటు అతనిలో ప్రవహించింది. మెరుస్తున్న మెరుపుని పట్టుకుని బ్రహ్మ ఆమెను సృష్టించినట్లున్నాడు. అయస్కాంతానికి రజను అతుక్కుపోయినట్లు అతని చూపులు ఆమెను అంటుకున్నాయి.

"బాబూ! ఏమన్నా అడుగు". ఆమె తండ్రి అడిగాడు.

"అక్కరలేదు..." రవి అన్నాడు.

"ఫలహారం తీసుకో బాబు". ఆమె తల్లి అంది.

"వద్దు. అతికితే గతకదని సామెత! నన్ను బలవంతం చేయకండి", ఉబ్బి తబ్బిబ్బవుతూ అన్నాడు రవి.

"పోని కాఫీ తీసుకో బాబు!"

"సరే కాఫీ...!" రవి తీసుకుంటూ అన్నాడు. మనోరంజని పకపకా నవ్వింది. ఆ నవ్వు ఆతగాడి గుండెల్ని కుదిపేసింది. అమ్మాయిలోపలికి వెళ్ళి పోయింతర్వాత ఆమె తండ్రి అడిగాడు రవీంద్రను సాగనంపుతూ- "బాబు! అమ్మాయి ఎలా వుంది?"

"ఇంటికెళ్ళంగానే మా వాళ్ళను పంపిస్తాను. చూడ్డానికి కాదు...నిశ్చయం చేసుకోవడానికి". రవి చెప్పాడు రిషా ఎక్కుతూ, ఆయన దగ్గర సెలవు తీసుకుంటూ.

ఆమె తండ్రి బస్టాండుకు వస్తానన్నాడు. వద్దని చెప్పాడు. ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి వెళతానన్నాడు.

లాడ్జికి వచ్చిన రవి కోసం ఎవరో నిరీక్షిస్తున్నారు. గదిలోకి అతను కూడా వచ్చాడు. అతని ప్రవర్తన వింతగా వుంది. "మీరు రవీంద్రకదూ!" ఆగంతకుడు అడిగాడు.

"అవును మీకెలా తెల్సు?"

"కొందరి దురదృష్టవంతుల పేర్లు తెలుస్తూ వుంటాయి".

"ఏంటిమీరనేది?" కోపంగా అన్నాడు రవి.

"మనోరంజన్ని చూడ్డానికి వచ్చింది మీరేకదూ?"

"యస్-మీకెలా తెల్సు?"

"ఎలాగో... ఒక నిజం చెబుదామని వచ్చాను".

"ఏంటా నిజం?"

"రంజని క్యారెక్టర్ మంచిది కాదు".

"యూ బ్లడీ!"

"ఆవేశపడద్దు. దక్షిణామూర్తితో ఆమెకు అక్రమ సంబంధం వుందని అందరూ అనుకొంటూ వుంటారు."

"నేను నమ్మను."

"అది నీ ఖర్మ - వస్తాను". ఆగంతకుడు వెళ్ళిపోయాడు.

రవీంద్ర పిలుస్తున్నా అతను వినిపించు కోకుండా వెళ్ళి పోయాడు. అతని మెదడు మొద్దుబారిపోయింది. ఏది నిజం - ఏది అబద్ధం అర్థంకావడంలేదు. ఆమె అందం అతన్ని వేటాడుతున్నది. దివి నుండి భువికి దిగి వచ్చిన దేవకన్యలా ఆమె వుంది. ఆ నవ్వు - ఆచూపు విరితూపులా —
అతని హృదయాన్ని ముక్కలు చేస్తున్నాయి - సమ్మోహనాస్త్రం వేసినట్లు ఆమె అందం అతన్ని పిచ్చివాడ్ని చేసింది.

"నో! అందమైన మనోరంజని ఎప్పటికీఅలా శీలం పోగొట్టుకోదు!" బయటకు అరిచాడు. పదే పదే ఆగంతకుడి మాటలు గుర్తుకొస్తున్నాయి. మనసు వికలమై పోతున్నది. నోట్లో పెట్టుకోబోతున్న లడ్డూలో కల్తీ కలిసిందని చెపితే ఎంత నిరాశపడతారో-అలా విలవిల్లాడి పోతున్నాడు. వదులుకోలేడు-వాస్తవాన్ని భరించలేడు. సాయంత్రానికో నిశ్చయానికొచ్చాడు. తను మనోరంజనిని పెళ్ళిచేసుకు తీర్తాడు-అంతే! రాత్రి బస్టాండులో కర్నూలు బస్సు కోసం నిరీక్షిస్తూ నిల్చున్నాడు. బస్సు రావడం ఎందుకో ఆలస్యం అయింది. చీకట్లో మెరుపు మెరిసింది. రంజని-మనోరంజని!

సముద్రంలో తేలిపోయే మత్స్యకన్యలా వస్తున్నది. ఎవరో అతన్ని కట్టిపడేసినట్లు బిగుసుకుపోయి చూస్తు నిల్చున్నాడు. మనోరంజని నవ్వింది చిన్నగా-కాని అతని ఎదలో పెద్దగా అలజడి చెలరేగింది.

"హలో రవీంద్రగారు ! మీతో మాట్లాడాలి...కొంచెం పక్కకు వస్తారా?" కోటి వీణలు మీటినట్లు ఆమె పలికింది.

"ఓ-ష్యూర్ !మీతో నరకానికైనా వస్తాను !" రవీంద్ర మంత్రముగ్ధుడిలా ఆమెను అనుసరించాడు. ఓ మూలకు పోయింతర్వాత అడిగింది ఆమె-

"మీ గురించి నాకు చాలా మంచి అభిప్రాయం వుంది. మరి నా గురించి మీరేమనుకుంటున్నారో తెల్సుకోవచ్చా?"

"ఎన్నో జన్మల పుణ్యంవలన నాకు లభించబోతున్న అపురూపమైన కానుక-అని అనుకొంటున్నాను. మిమ్మల్ని చూడగానే నా తపస్సు ఫలించింది అని అనిపించింది. చాలా మంది అమ్మాయిల్ని చూశాను-కాని...మిమ్మల్ని చూడగానే ఎందుకో నా మనసు స్వాధీనం తప్పింది. మీ అందానికి నా దాసోహం మనోరంజని గారు !" ఆర్ద్రతతో చెప్పాడు రవీంద్ర.

"అంటే...నన్ను పెళ్ళిచేసుకుంటారా?"

"ఆఁ! మీ మెళ్ళో మూడు ముళ్ళువేసి పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. మీ నీడలో నా మోడువారిన బతుకు చిగురిస్తుంది." ఎంతో భావుకతతో చెప్పాడు.

"రవీంద్రగారు...ప్లీజ్ మీ అభిమానంతో నన్ను పిచ్చిదాన్ని చెయ్యకండి ...నా మాట వింటారా?"

"ఇంకేం చెప్పకండి. నాకు కానీ కట్నం వద్దు-మీరు ఒప్పుకుంటే చాలు...నా జీవితానికో వెలుగు వస్తుంది."

"అయ్యో! నన్ను మాట్లాడనివ్వండి."

"మాట్లాడండి. ఎంతో హాయిగా వుంది. వెధవ బస్సు పోయినా నాకు దిగుల్లేదు. మీ సాన్నిధ్యంలో నాకు స్వర్గం..."

"ప్లీజ్ చెప్పనివ్వండి...నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు". మనోరంజని వేలుకుపమిటకొంగు చుడుతూ చెప్పింది. రవీంద్రకు భూమి తిరుగుతున్నట్లు-ఆకాశం మీదపడ్డట్టు...అయోమయం అయిపోతున్నది.

"నేను మీకు నచ్చలేదా?" హీనస్వరంతో అడిగాడు ఒంట్లోని శక్తిని కూడగట్టుకుని.

"అయ్యో ఎంతమాట! మిమ్మల్ని కట్టుకోవాలంటే పెట్టిపుట్టాలి!" కంగారుగా అంది మనోరంజని.

"మరి!?" విస్మయంగా అడిగాడు.

"మీకు పాటలు పాడటం వచ్చా?" సూటిగా అడిగింది.

"రాదు". చెప్పాడు.

"పోనీ పాటలు రాయడం వచ్చా?"

"రాదు".

"పోనీ పాటలకు బాణీలు కట్టడం వచ్చా?"

"రాదు".

"పోనీ నాటకాలు వేయగలరా?"

"ఉహూఁ! వేయలేను".

"పోనీ... నాటకాలు రాయగలరా?"

"ప్చ్! రాదు".

"పోనీ... నాటకం వేయించగలరా?"

"సారీ... వేయించలేను".

"పోనీ-కథలు రాయగలరా?"

"ఉత్తరాలు రాయడం కూడ రాదు".

"నవలలు రాయగలరా?"

"ఎప్పుడన్నా చదువుతాను".

"కవిత్వం చెప్పగలరా?"

"రాదు".

"పోని స్టేజి ఎక్కి ఉపన్యాసం ఇవ్వగలరా?"

"కాళ్ళు వణుకుతాయి-గొంతు తడారిపోతుంది".

"పోని మిమిక్రిచేయగలరా?"

"రాదు".

"పోనీ, జోకులేసి అందర్నీ నవ్వించగలరా?"

"నాకు నవ్వే అలవాటులేదు".

"వీటన్నిటిలో ఏదీ మీకు రాదన్న మాట, ప్చ్!"

"నాకే కాదు-ఇవన్నీ ఎవరికీ రావు... మహా అయితే ఒకటి ఒకడికి రావచ్చు".

"కాని రవీంద్రగారు! ఆయనకు నేను చెప్పినవన్నీ వచ్చు. తనొక్కడే ఈ పన్లన్నీ చేయగలడు!" ఆమె చెప్పింది.

"ఎవరతను?" తడారిపోతున్న గొంతుతో అడిగాడు.

"దక్షిణామూర్తి!" చిన్నగా చెప్పింది. స్కడ్‌క్షిపణి తలమీద పడ్డట్టు అదిరిపడ్డాడు.

"ఆయన ఒక మనిషి కాదు-ఒక సంస్థ!" మనోరంజని చెప్పింది వెళ్ళబోతూ.

రవీంద్ర తేరుకున్నాడు- ఆమెను ఆపాడు అడ్డువచ్చి.

"కాని... మీరు అడిగినవాటిల్లో ఏది లేకపోయినా దాంపత్య జీవితానికి అడ్డు రాదనుకుంటాను. వైవాహిక జీవితం సుఖంగా వుండటానికి కావలసింది లలితకళలు కావు... ఒకర్నొకరు ఇష్టపడ్డం- అర్థంచేసుకోవడం!" శాంతంగా చెప్పాడు.

"కాని నాకుచిన్నప్పటినుండి లలిత కళలంటే ఎంతో ఇష్టం- అవి లేకుండా నేబతకలేను!"

"పోనీ, మీరడిగినవాటిల్లో మీకుఏమేమి వస్తాయి?"

"ఏమీరావు".

"మరి...నాకు రాకపోతే మీకభ్యంతరం ఏమిటి?"

"అందుకే నాకు దక్షిణామూర్తి అంటే ఇష్టం. దయచేసి నన్ను మర్చిపోండి. ఈ పెళ్ళి ఇష్టంలేదని ఉత్తరం రాయండి-ప్లీజ్! మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను." ఆమె ప్రాధేయపడింది.

"ఉహూ( ! ఇష్టమే అని రాస్తాను. ఏమవుతుంది?"

"మా నాన్న పట్టుపట్టి మీతోనే పెళ్ళి జరిపిస్తాడు కాని మీ ఇంటికొచ్చేది నాశవం మాత్రమే!"

"అదేం దక్షిణామూర్తి గురించి మీ నాన్నకు చెప్పచ్చుగా- అంత గొప్పకళాకారుడ్ని ఏ తండ్రి కాదంటాడు?"

"మా నాన్నకు కళాకారులంటే పెద్దసదభిప్రాయం లేదు"!

"ఏం అతనికి ఉద్యోగం లేదా?"

"ఉంది- ఓ చిన్న బాంక్‌లో పనిచేస్తాడు. అయ్యో మీ బస్సు... బయలుదేరింది... పరుగెత్తండి... బస్సు మిస్సవుతారు." తొందరపెట్టింది మనోరంజని.

"ఎప్పుడో మిస్సయ్యాను నాబస్సు ను.. బై! నా నుంచిమీకెలాంటి ప్రమాదం వుండదని హామీ ఇస్తున్నాను.... బై!" పరుగెత్తుకుంటూ వెళ్ళి బస్సెక్కాడు. ఆమె చెయ్యి ఊపుతూ నిలబడింది. కన్నీటి పొర అడ్డం రావడంతో మసక మసగ్గా కనిపిస్తున్నది. నీరసంగా చెయ్యెత్తి ఊపాడు. జీవితంలో మనోరంజనిని కలవడం అదే ఆఖరుసారి అనుకున్నాడు. తన కలల సౌధం కుప్పకూలిపోయింది. తన ఊహాసుందరిని చూడగలిగి కూడ- చేరుకోలేకపోయాడు.

విధాతకు వెర్రి వేయి విధాలు! మనోరంజని ఇచ్చిన షాక్‌నుండి తేరుకోవడానికి రవీంద్రకు చాలాకాలంపట్టింది. ఆ ఫ్రస్టేషన్‌లో తల్లిదండ్రులు చూపించిన సంబంధం మట్టసంగా ఒప్పేసుకున్నాడు. నెల తిరిగేలోగా సుచరితతో పెళ్ళి జరిగిపోయింది. సంవత్సరం తిరిగేలోగా తండ్రి అయిపోయాడు. రెండో సంవత్సరాంతానికి సుచరితకు ఫ్యామిలి ప్లానింగ్ ఆపరేషన్ కూడా చేయించాడు- రెండో కాన్పులో! మూడో సంవత్సరాంతానికి ప్రమోషన్ మీద అనంతపురం బదిలీ అయ్యాడు. కుటుంబాన్ని అనంతపురం మార్చాడు. అనంతపురంకి వచ్చిన ఆర్నెల్లతర్వాత ఓ రోజు సాయంత్రం నడుచుకుంటూ వెళుతూ వుంటే ఎవరో ఒక పెద్దాయన రవీంద్రకు విష్ చేశాడు. రవీంద్ర పోల్చుకోలేకపోయాడు.

"నేను బాబు... జానకిరామయ్యను." ఆయనే చనువుగా పలకరించాడు. రవీంద్ర ఆయనవంక తేరిపార చూస్తున్నాడు.

"గుర్తుపట్టలేదా రవీంద్రబాబు!"

"నా పేరు మీకెలా తెల్సు?!"

"నేను... మనోరంజని తండ్రిని" కళ్ళుతుడుచుకుంటూ చెప్పాడు.

"అరే మీరా ఇక్కడ! రండి అలా హోటల్లో కూర్చొని కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం." రవీంద్ర సంతోషంగా దగ్గరున్న హోటల్లోకి ఆయన్ని తీసుకువెళ్ళాడు. రెండు కాఫీలు ఆర్డరిచ్చాడు-నిశ్శబ్దంకాసేపు.

"బాగున్నావా బాబు!" ఆప్యాయంగా పలకరించాడు కాఫీని సిప్ చేస్తూ.

"ఏదో మీ దయ." రవీంద్ర అన్నాడు. చురుగ్గా చూశాడు జానకిరామయ్య.

"భగవంతుడి దయ మీలాంటి మంచాళ్ళపైన ఎప్పుడూ వుంటుంది."

"ఏం ఇలా వచ్చారు?" రవీంద్రకుతూహలంగా అడిగాడు.

"తెలీదా! మనోరంజని ఇక్కడే కాపురం వుంటుంది."

"అంటే... ఆమెకు పెళ్ళయిందా!?"

"ఏం? నువ్వు కాదన్నంత మాత్రన పెళ్ళి కాదనుకున్నావా?" జానకిరామయ్య అన్నాడు. రవీంద్ర తలదించుకున్నాడు.

"సారీ, అలా రాయల్సి వచ్చింది గత్యంతరం లేక."

"తర్వాత నాకు తెల్సింది బాబు-అప్పటికే అంతా అయిపోయింది... మామనూ మనువు కూడా అయిపోయింది." కళ్ళు తుడుచుకున్నాడు.

"అల్లుడు ఏం చేస్తాడు?"

"డబ్బుతగలేస్తాడు." కరుగ్గా చెప్పాడు.

"అంటే ఉద్యోగం లేదా?"

"లేకేం... బాగానే వుంది. కానీ వచ్చే జీతం అతనికి ఏ మూలకి వస్తుంది? సకలగుణాభిరాముడు మా దక్షిణామూర్తి!" చెప్పాడు బాధగా జానకిరామయ్య.

"చివరికి తన పంతం నెగ్గించుకుందన్నమాట!"

"అంతే బాబు! కొన్ని ఘటాలు ఎవరెన్ని చెప్పినా వినవు. అదృష్టం అందలం ఎక్కిస్తూవుంటే బుద్ధి బురదలోకి లాగుతుందని... వస్తా బాబు! బస్సు టైమయింది." లేస్తూ అన్నాడు జానకిరామయ్య.

"ఇఫ్ యూ డోంట్ మైండ్... మీ అల్లుడు గారి అడ్రసు ఇస్తారా?"

"ఎందుకు బాబు!"

"మనోరంజనిని చేసుకున్న అదృష్టవంతుడ్ని చూద్దామని!"

జానకిరామయ్య మారుమాట్లాడకుండా జేబులోంచి ఓకాగితం తీసి దానిమీద అడ్రసు రాసిచ్చి హడావిడిగా వెళ్ళిపోయాడు. తనసుందరి ఈ ఊళ్ళో వున్నందుకు ఆనందించాలో... ఇదే ఊళ్ళో మొగుడుతో... కాపురం చేసుకుంటూ హాయిగా వున్నదానికి ఈర్ష్యపడాలో అర్థంకాలేదు. ఓ ఆదివారం వీలు చూసుకుని మనోరంజనిని వెతుక్కుంటూ వెళ్ళాడు. ఫలానా దక్షిణామూర్తి ఇల్లు ఎక్కడా అని అడిగితే అందరూ చెప్పగలిగారు కాబట్టి ఇల్లు కనుక్కోవడం కష్టం కాలేదు.

"దక్షిణామూర్తి గారూ!" దగ్గరకేసున్నతలుపు ముందు నిలబడికేకపెట్టాడు.

"లేరు" ఎవరో అరిచారు లోపలినుండి. అది మనోరంజని గొంతులాగా వుంది. రవీంద్రకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది.

"ఎప్పుడొస్తారు?"

"తెలీదు".

"ఓసారి ఆయనతో మాట్లాడాలి..."

"మళ్ళీ రండి...."

"కొంచెం ఇన్‌ఫర్‌మేషన్ పాసాన్ చెయ్యాలి- బయటికొస్తారా?" రవీంద్ర అన్నాడు

కాసేపటికి మనోరంజని బయటకొచ్చింది. అదే అందం! అదే నవ్వు! కాకపోతే ఒళ్ళు బోసిగా వుంది. చేతులకు మెడకు ఆభరణాలు కనపడలేదు. చీర కూడ సాదాసీదాగా వుంది. అయినా సహజ సౌందర్యంతో మెరిసిపోతున్నది.

"మీరు... మీరు.... రవీ... రవీంద్రకదూ!" ఆమె అడిగింది.

"కూర్చోండి...కాఫీ తెస్తాను." ఇంకేం అవకాశం ఇవ్వకుండా లోపలికి వెళ్ళింది. ఓనిమిషంలో చేతిలో కప్పుతో ప్రత్యక్షమయింది.

"బాగున్నారా?" కాఫీ అందుకుంటూ అడిగాడు.

"ఆ(! మీ దయ వలన!"

"ఇందులో నాదయ ఏముంది!?"

"నేను కోరినట్లు మీరు నన్ను నిరాకరించకపోతే...ఇంట్లో మా పెళ్ళికి ఇంకా ఎక్కువ రభస అయ్యేది," ఆమె గుమ్మంలో నిలబడి చెప్పింది.

"కనీసం శుభలేఖ పంపుతారనుకున్నాను."

"కాని... మాది రిజిస్టరు మ్యారేజ్-ఎవరినీ పిలవలేదు."

"ఆయనేరి!"

"ఇవ్వాళ ఆదివారం కదా! క్షణం తీరికుండదు." చెప్పింది.

"ఏం చేస్తారు?" పొడిగా అడిగాడు.

"అబ్బో! నాటకం డైరెక్షన్ చెయ్యాలిట! అఫ్‌కోర్స్ దాంట్లో హీరో మా ఆయనే!" అదో రకం ఇగోతో చెప్పింది.

"ఇంకా ఆయనకా పిచ్చి పోలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"పిచ్చా!!"

"మరి-పెళ్ళయి పెళ్ళాం బిడ్డలువున్న తర్వాత నాటకాలంటూ వీధుల్లో వేలాడుతుంటే సంసారం ఎలా నడుస్తుంది?"

"నటన ఆయన ఊపిరి!" గర్వంగా అంది.

"మనోరంజని గారూ! నేను అతిసామాన్యుడ్ని కావచ్చు...కాని ఓ చిన్న సలహా ఇద్దామనుకుంటున్నాను."

"సందేహమెందుకు చెప్పండి."

"ఏ బాదరబందీలు లేనప్పుడు మొగాడు ఎలా తిరిగినా చెల్లుతుంది. కాని... సంసారం వున్న తర్వాత దాన్ని చక్కదిద్దుకోవాలి."

"చూడండి రవీంద్ర గారూ! మీలాంటి మెటీరియలిస్టులకు కళాకారులకుండే విలువ తెలీదు. కళలంటే ఏంటో తెలీదు. ఇక సంసారం అంటారు, చక్కదిద్దుకునే సామర్థ్యం నాకుంది. థ్యాంక్స్"! విసురుగా అని లోపలికి వెళ్ళిపోయింది. రవీంద్ర అక్కడ నుండి బయలుదేరి వచ్చేశాడు.

ఓ రోజు మందులు కొందామని షాపులోకి అడుగుపెట్టబోతున్న రవీంద్రకొన్ని మాటలు వింటూ ఆగిపోయాడు.

"ప్లీజ్! ఈ మందులివ్వండి". ఆమె బ్రతిమాలుతూన్నది.

"లేదమ్మా! ఇప్పటికే దాదాపు వెయ్యికి పైగా మీ బాకీ వుంది. ఇంక ఇచ్చేది లేదు. ముందా వెయ్యికట్టండి." షాపతను విసురుగా అంటున్నాడు.

"ప్లీజ్! మందులు చాలా అవసరం. ఇవి వాడకపోతే ఆయనకు మళ్ళీ జబ్బు ముంచుకొస్తుంది. ఈ ఒక్కసారికి..." బ్రతిమాలుతూన్నది.

"ఈ మందులు రెండొందలు పైగా అవుతాయి ఎప్పుడిస్తారు?"

"వీలైనంత తొందరలో!"

"ఇలా అంటూనే నెలలు గడిపేస్తున్నారు".

"ఏం చేస్తాం... ఆయనకు మంచి ఛాన్స్ తగలడంలేదు. తగిల్తే ఈ వెయ్యి ఓలెక్క!"

"సరే.. తీసుకుపోండి". అంటూ ప్యాక్ చేసి ఇచ్చాడు.

"ఖాతా రాసుకోండి". ధీమాగా అని వెనక్కి తిరిగింది.

మనోరంజని రవీంద్రను చూసి ఉలిక్కిపడింది.

"రవీంద్ర! మీరా!"

"అవును..."

"నాకు పనుంది... మళ్ళీ కలుసుకుందాం..." పరుగున వెళ్ళబోయింది.

"మనోరంజని ఒక్కమాట !" ఆమెని వెంబడించి అరిచాడు.

వెనక్కు తిరిగి చూసింది. అతను దగ్గరికి వచ్చి అన్నాడు.

"మీకేమైనా ఇబ్బందులుంటే నేను వున్నానని మర్చిపోవద్దు. మీ స్నేహితుడిగా మీకెప్పుడూ సహాయపడ్తూ వుంటాను. ఇదిగోండి నా విజిటింగ్ కార్డ్ !" చెప్పాడు కార్డు ఇచ్చి.

"థ్యాంక్స్- ఆ అవసరం రాకపోవచ్చువస్తా!" విసురుగా వెళ్ళిపోయింది.

"ఏం సార్- మీకామె తెల్సా?" షాపతను అడిగాడు.

"ఆ(! ఇంతకి ఆమెకు మందులెందుకు?" అడిగాడు.

"ఎందుకేంటి సార్! వాళ్ళాయన రోగాలపుట్ట. లేని జబ్బులంటూ లేవు అతనికి". షాపతను వెకిలిగా నవ్వాడు.

"మిష్టర్ అతని గురించి నీకేం తెల్సు! అతనో పెద్దకళాకారుడు, గొప్ప నటుడు, నాటకకర్త, రచయిత, కవి, గాయకుడు, మిమిక్రీ ఆరిస్టు!" రవీంద్ర ఆవేశంగా చెప్పాడు.

"ఆ( !వాటితోపాటు తాగుబోతు, తిరుగుబోతు, జూదరికూడా!" ఎగతాళిగా అన్నాడు.

రవీంద్ర చెయ్యి పైకి లేచింది అతన్ని కొట్టడానికి. వివేకం అడ్డు వచ్చింది.

"నువ్వు చెప్పేది నిజమేనా?"

"ఈ వాడలో ఎవరిని అడిగినా చెబుతారు- ఆఖరికి ఏ రిక్షావాడిని అడిగినా చెబుతాడు. రాత్రయ్యేసరికి ఫుల్‌గా మందు కొట్టి ఒంటిమీద స్పృహలేని స్థితిలో ఇంటికి చేరుకుంటాడు. అది కూడ ఏ ఇంటికి అని అని అడగండి. అతడికో ముండవుంది. అతడితోపాటే డ్రామాలేస్తుంది. అది సైడ్ బిజినెస్. మెయిన్ బిజినెస్ వీళ్ళలాంటి వాళ్ళపైన వల విసరడం! ఆ ముండ చేతిలో చిక్కుకున్న వాళ్ళు అంత సులభంగా ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకోకుండ బయటపడలేరు!" షాపువాడు చెప్పాడు.

రవీంద్ర మనసు కకావికలమై పోయింది. ప్రేమించి పెళ్ళి చేసుకున్న మనోరంజని జీవితం ఇలా తగలడింది?!

ఓ రోజు మనోరంజని ఇంటికి వెళ్ళాడు రవీంద్ర. ఈసారి నేరుగా లోపలికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అలికిడివిని వంటింట్లోంచి బయటకొచ్చింది.

"రవీంద్రా! ఆయన లేరు."

"నేను నీ కోసమే వచ్చాను."

"నా కోసమా !సామాన్యురాల్ని."

"మనూ !ఒక్క నిజం చెప్పు. మీ ఆయన వ్యసనాలకు బానిస అయ్యాడా?" రవీంద్ర అడిగాడు.

రెండు చేతుల్తో మొహాన్ని కప్పుకుని ఏడ్చింది.

"ఇంత తెలివికలదానివి ఆయనకు వ్యసనాలు అలవాటు కాకుండా ఎందుకు ఆపలేకపోయావు?"

"ఏం చెప్పమంటారు. నేను నాటకం రాయాల్, మూడ్ కావాల్, అంటూ తీర్థం పుచ్చుకుంటారు. అది పడందే ఆయన పెన్ను కాగితం మీద అక్షరం ముక్క రాయలేరు." ఏడుస్తూ చెప్పింది.

"ఇప్పుడాయన,రాయలేకపోతే దేశానికొచ్చిన నష్టం ఏంటిట !" విసుగ్గా అన్నాడు రవి.

"అబ్బా !రాయని రోజు పిచ్చి పట్టిన వాడిలా ప్రవర్తిస్తారు. అసలు ఇది అయనకు నాటకాలు వేయడంలో అలవాటయింది. ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టినప్పుడల్లా విందు చేసుకుని మందు పుచ్చుకునే వారు!"

"ఆ నాటకాలు వేయడం మానేయిస్తేసరి!"

"ఆయనలో ఊపిరి వున్నంతకాలం నాటకాలు మానరు!"

"రంభలాంటి నిన్ను పెట్టుకుని అదెవరో ముండ దగ్గరకు వెళతాట్ట !ఛీ! ఛీ!" తలవంచుకుని అడిగాడు

నిట్టూర్చింది మనోరంజని.

"సావాసదోషం !ఆమెతో నాటకాలు ఆడి ఆడి ఆమెకు నటన నేర్పి నేర్పి ఆమె మోజులోపడ్డారు. అయినా నాకేం తక్కువ చేయడం లేదు. నన్ను బాగా చూసుకుంటున్నారు!"

``ఛీ!ఛీ!ఎంత దిగజారిపోయావు''ఏవగించుకున్నాడు.

``ఏం చెయ్యను రవీంద్రా! కళాకారుడికి సరస్వతీదేవి శాపం! వాళ్ళు వాళ్ళ కళల్లో ఎక్కడ విజృంభించిపోతారోనని వ్యసనాలకు బానిసలైపోండని శపించింది. దాదాపు ఆయన స్నేహితులంతా అలవాట్లకు దాసులే''కళ్ళుతుడుచుకుంటూ చెప్పింది.

``మనూ! పెళ్ళికి ముందు నీకు మీ ఆయన గురించి వివరంగా తెల్సా?''

``గొప్ప నటుడు- ఆయన గురించి నిజం నాకెలా తెలుస్తుంది?''

``స్కాండ్రల్ నిజ జీవితంలో నటించాడన్నమాట?''

``ప్లీజ్! ఆయన్ని ఏమీ అనద్దు-ఆయనలోని కళాసరస్వతిని చూసి పెళ్ళి చేసుకున్నాను. కాకపోతే ఆయన్ని మార్చుకోలేకపోవడం నా అసమర్థత!'' ఏడ్చింది.

``మీ ఆయన ఆరోగ్యం ఎలా వుంది?''

``ప్లీజ్! నన్నింకేం అడగొద్దు. మీ దగ్గరుంటే డబ్బు సర్దండి.''

``అరే మనూ! నీ ఒంటిమీద నగలు- మీ ఆయన ఆస్తి...''

``రవీంద్ర- చెప్పాలంటే చాలా కథవుంది. ఓ సంవత్సరం పాటు మద్రాసులో వుండి సినిమా ఛాన్సులకోసం ప్రయత్నించారు. చిన్నా చితక పాత్రలైతే వచ్చాయికాని ఆయన ఆశించినట్టుగా హీరో అవకాశాలు రాలేదు. దాంతో నిరాశపడిపోయి తిరిగివచ్చారు. కాని... ఊరికే రాలేదు. పుట్టెడు వ్యసనాలకు బానిసై తిరిగి వచ్చారు''. ఏడుస్తూ చెప్పింది.

``ఇదిగో- అయిదొందలు... వస్తా!'' రవీంద్ర బాధపడ్తూ వచ్చేశాడు.

అప్పటి నుండి ఎప్పుడైనా అటువైపుపోయి ఆమెకు కొంత డబ్బు ఇస్తూవుండేవాడు. సుచరిత కొన్నాళ్ళకు గమనించింది భర్త జీతం తరిగిపోవడం. విషయం తెల్సుకుని నానా రచ్చ చేసి అతన్ని పోనీయకుండా కట్టిపడేసింది. మళ్ళీ ఈ రోజు ఈ అర్ధరాత్రి మనోరంజని దర్శనం! కలతనిద్రపోయి ఆలశ్యంగా లేచాడు. ఆ రోజు ఎలాగూ హాలిడే కాబట్టి ఆసుపత్రికి బయలుదేరాడు. ముందు కొంచెం సందేహం కలిగింది. దక్షిణామూర్తిని ఎక్కడ చేర్పించి వుంటారాని. కాని బీదవాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రికి తప్పించి ఎక్కడికి వేళ్ళగలరు? అతని ఊహ నిజమైంది. ఇన్ పేషంట్స్ లిస్టులో దక్షిణామూర్తి పేరు వుంది.

``నర్సు! దక్షిణామూర్తి ఎక్కడ వున్నాడు?.'' ఎదురుగా కనిపించిన నర్సును అడిగాడు.

``అతనా... ఇంటెన్సివ్‌కేర్ యూనిట్లో వున్నాడు''.

``అతనికేమైంది...?''

``నాకు తెలీదు... అక్కడికి వెళ్ళండి''. నర్సుచెప్పింది.

వరండాలో మనోరంజని ఎదురొచ్చింది. మొహం పాలిపోయింది. ఏడ్పు చారికలు ఆమె చెంపలమీద కనిపిస్తున్నాయి.

``వచ్చావా రవీంద్ర! రావనుకున్నాను''

``సారీ! లేటయింది. ఎలా వుంది?'' ఏడ్చేసింది. ఆమె!

బిత్తరపోయాడు రవీంద్ర.

"ఎక్కడ వున్నాడు? ఎలా వుంది?"

"కండిషన్ క్రిటికల్ అన్నారు. ఆబాధనే చూడలేను. ఏవోఏవో సూదులు పొడుస్తున్నారు. ఆక్సిజన్ పెట్టారు..ఆ యమబాధ చూడలేక బయటికి వచ్చాను." మనోరంజని ఏడుస్తూ అతన్ని పట్టుకుంది.

"ప్లీజ్ మనూ ధైర్యంగా వుండు. అతనికేంకాదు-ఇదిగో నీ కోసం వెయ్యి రూపాయలు డబ్బు తెచ్చాను. నా దగ్గరలేదు-వచ్చేప్పుడు నీకవసరమవుతుందని అప్పుచేసి తెచ్చాను." జేబులోంచి డబ్బు తీసి ఆమెకిచ్చాడు.

ఆమె ఆబగా అందుకుంది "దేనికైనాపనికివస్తుంది."

డాక్టర్ రూములోంచి బయటకి వస్తే రవీంద్ర ఆయన్ని అనుసరించాడు. అతను కుర్చీలో కూర్చున్న తర్వాత దక్షిణామూర్తిని గురించి అడిగాడు.

"సారీ!మేం చెయ్యాల్సిందల్లా చేశాం"!

"అంటే...సార్!"

"డౌట్‌ఫుల్ కేసు. లివర్ బాగా దెబ్బతింది... లంగ్స్ కూడా పాడైపోయాయి. వీటికి తోడు రాత్రి నుండి కిడ్నీస్ ఫెయిలయ్యాయి." డాక్టర్ అన్నాడు." అతనిలో ప్రవహిస్తున్నది రక్తం కాదు, విస్కీ!"

"సార్ అతను బ్రతకాలి సార్...అతను బ్రతకాలి ఎంత ఖర్చయినా ఫర్వాలేదు!" అప్రయత్నంగా ఏడ్పు వచ్చింది రవీంద్రకు.

"మీకేమవుతాడు!?" ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్.

"సారీ!నాకు ఏమీ కాడు. కాని దేశానికి మటుకు అతనో గొప్ప కళాకారుడు! అతను పోతే ఆంధ్రదేశం ఓ గొప్ప కళాకారుడ్ని,బహుముఖ ప్రజ్ఞాశాలిని కోల్పోతుంది!" ఏడుస్తూ చెప్పాడు రవీంద్ర.

"సారీ! అతనిదంతా స్వయంకృతం! అతనికి లేని అలవాటు లేదు... ప్చ్!" డాక్టర్ పెదవి విరిచాడు.

ఇంతలో పెద్దగా ఏడ్పులు వినిపించాయి. దడదడలాడుతున్న గుండెతో రవీంద్ర అక్కడికి పరుగెత్తాడు. మనోరంజని దక్షిణామూర్తి మీద... కాదు... అతని శవం మీద పడి పడి ఏడుస్తున్నది. కళాకారుడి హంస ఎగిరిపోయింది ఆమెకన్న కలల్ని కల్లలుచేస్తూ. రవీంద్ర ఏడుస్తూ అతని శవాన్ని చూసి ఆశ్చర్యపోయాడు అంత విషాదంలో కూడ! అతను ఒకప్పటి ఆగంతకుడు!

(స్వాతి మంత్లీ ---------)